నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | బుధవారం 5 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

నీరు అందక నెర్రలువారిన నేల, ఎండిన వరి పైరు

ఎండిన పొలాలను చూపిస్తున్న రైతులు

నీరు లేని సదర్మాట్ కాలువ

రైతు బతుకు ఆగం

వట్టిపోతున్న పంటలను చూసి దిక్కుతోచని స్థితిలో రైతాంగం

- నెర్రలుబారుతున్న భూములు.. చుక్కనీరు లేని కాలువలు..
- కలుపు దశలో నీరివ్వకపోవడంతో ఎండిపోతున్న పంటలు
- నీటిని విడుదల చేసి ఆదుకోవాలంటున్న 'సదర్మాట్' రైతులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న సాధన సమితి సభ్యులు

కడెం, మార్చి 4 : సదర్మాట్ ఆయకట్టు రైతులు సాగు నీటికి అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వరి నాట్ల దశలో ఉండగా నీరు అధికంగా అవసరం. నీటిని నిలిపివేయడంతో పంటలు వట్టిపోతున్నాయి. కాగా.. సదర్మాట్ ఆయకట్టు పరిధిలో ఖానాపూర్‌తోపాటు, కడెం మండలంలోని మల్లన్నపేట, లింగాపూర్, సారంగపూర్, ఎలగడప, దిల్దార్‌నగర్, పెత్తార్పు, మాసాయిపేట, నచ్చన్‌ఎల్లాపూర్, ధర్మాజిపేట, కొత్తమద్దిపడగ, పాతమద్దిపడగ, లక్ష్మీసాగర్, పెద్దూర్‌తాండ, చిట్యాల, పెద్దబెల్లాల్ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లోని వ్యవసాయ భూములకు యాసంగి పంటలకు నీరు అందిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇవ్వడంతో దాదాపు 12,500 ఎకరాల వరకు వరి సాగు చేశారు. నాట్లు వేసి, ప్రస్తుతం కలుపు దశకు వచ్చే సరికి ఎగువ ప్రాంతం నుంచి నీటిని నిలిపివేశారు. ప్రధానంగా ఎలగడప, పెత్తార్పు, మాసాయిపేట ప్రాంతాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. ఈ గ్రామాల పక్కనే గోదావరి ఉన్నప్పటికీ నీరు అందడం లేదు.

కేసీఆర్ హయాంలో రెండు పంటలకు నీరు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వానకాలం, యాసంగి పంటలకు చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేవారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా అందించడం లేదు. సదర్మాట్ అంటేనే కడెం, ఖానాపూర్ రైతుల కోసం ఏర్పాటు చేసిన ఆయకట్టు. దీనిని ప్రస్తుతం 14 కిలోమీటర్లపైన నిర్మించడం వల్ల కడెం మండలంలోని చివరి ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతుందనేది రైతులు వాదన. ఇదిలా ఉంటే సదర్మాట్ నుంచి ప్రత్యేక కాలువను కడెం మండలానికి నిర్మించాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది. ఈ రెండు మండలాలకు సదర్మాట్ ఆయకట్టు జీవనాధారం కాగా, దీనిని పట్టించుకోకపోవడంలో ప్రస్తుత సర్కారు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఎస్సారెస్పీలో నీరు ఉండగా వారబందీ పద్ధతిన నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు.. ఇప్పుడు పూర్తిగా నీటి విడుదల చేయడం లేదు. నీటిని విడుదల చేసి పంటలు వట్టిపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

పంటలు ఎండుతున్నాయ్..

20 రోజులుగా కాలువ ద్వారా నీరొస్తుందని ఎదురు చూస్తున్నాం. చుక్క నీరు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నాం. వారబందీ పద్ధతి అన్నారు. ఖానాపూర్ మండలంలోని కొన్ని గ్రామాలకు నీరు చేరగానే కాలువను మూసివేస్తున్నారు. కడెం మండలంలోని చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదు. పంటలు ఇప్పటికే పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. ఇప్పుడు నీటిని విడుదల చేయకపోతే ఇంకా అన్యాయం జరుగుతుంది.

- జాడి గంగన్న, రైతు, పెత్తార్పు.

హక్కుగా ఉన్న సదర్మాట్‌ను అడ్డుకోవాల్సిన దుస్థితి

కడెం, ఖానాపూర్ మండలాల వరప్రదాయిని సదర్మాట్. అది ఈ రెండు మండలాల హక్కు. ఎగువన నీళ్లు ఉండగా ఎందుకు అన్యాయం చేస్తున్నారో అర్థం కావడం లేదు. కడెం ప్రాజెక్టుకు సరస్వతీ కాలువ ద్వారా నీటిని అందించి ఫీడ్ చేయాలి. కానీ.. సదర్మాట్ కాలువ ద్వారా నేరుగా అందించడం వల్ల చివరి ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతుంది. ఈ నీటిని పెద్దబెల్లాల్ వరకు అందించి రైతులను ఆదుకోవాలి. తరతరాలుగా సదర్మాట్ రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు. పక్షం రోజుల్లో తమ కార్యాచరణ ప్రకటించి ఉద్యమిస్తాం.

- హపావత్ రాజేందర్, సదర్మాట్ సాధన సమితి అధ్యక్షుడు.

అప్పుడు నిండుగా.. ఇప్పుడు దండగా..

రెండేళ్ల క్రితం వరకు నీటితో కళకళలాడిన కుమ్రం భీం ప్రాజెక్టు కాలువలు ప్రస్తుతం పిచ్చిమొక్కల నిండి వెలవెలబోతున్నాయి. 45 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా రెండేళ్ల క్రితం వరకు యాసంగిలో సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరు అందేది. కాలువల్లో నిండుగా నీరు ఉండడంతో ఆయిల్ ఇంజిన్ల ద్వారా యాసంగి పంటలకు రైతులు నీరందించేవారు. ప్రాజెక్టు కట్టకు బీటలు రావడంతో 10 టీఎంసీల సామర్థ్యాన్ని 5 టీఎంసీలకే అధికారులు పరిమితం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు, కాలువల నిర్వహణను పట్టించుకోకపోవడం, నీటిని వదలకపోవడంతో కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి, పంటలకు నీరందక రైతులు ఇబ్బందిపడుతున్నారు.

- కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ)

అంగన్‌వాడీ సిబ్బందిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అంగన్‌వాడీ సిబ్బంది ముందస్తు అరెస్ట్

రామకృష్ణాపూర్, మార్చి 4: ప్రజాభవన్ ముట్టడి కోసం హైదరాబాద్‌కు వెళ్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని రామకృష్ణాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మంగళవారం రామకృష్ణాపూర్‌లోని రాజీవ్‌చౌక్, 'బీ' జోన్ సెంటర్‌లో 11మంది అంగన్‌వాడీ సిబ్బంది హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ముట్టడి వెళ్లేందుకు గుమిగూడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉన్నారని పట్టణ ఎస్ఐ తెలిపారు. వారి చర్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

అక్రమఅరెస్టులు సరికాదు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 4: మినీ అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారానికి హైదరాబాద్ బయలుదేరుతున్న అంగన్‌వాడీలను పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదని సీఐటీయూ మంచిర్యాల జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. ప్రజా దర్బార్ హైదరాబాద్‌లోని ప్రజావాణిలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న కుమ్రం ఆసిఫాబాద్ జిల్లాలో అన్ని మండలాల్లో మినీ అంగన్‌వాడీలతో పాటు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారని తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాల్సింది పోయి అరెస్టులు చేయించడంతో సమస్య పరిష్కారం కాదన్న సంగతి రాష్ట్ర ప్రభుత్వం గ్రహించాలని సూచించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్ అమలు
- సీసీ కెమెరాలతో నిఘా

మంచిర్యాలటౌన్, మార్చి 4: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 22 వరకు జరగనుండడంతో ఇందుకు తగిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. కేంద్రాలను సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ సారి 5 నిమిషాల గ్రేస్ పీరియడ్‌ను అమలులోకి తీసుకువచ్చారు. ఈ ఏడాది మంచిర్యాల జిల్లాలో మొత్తం 12540 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలను రాస్తుండగా మొదటి సంవత్సరంలో ఇంటర్ విద్యార్థులు 4965, వొకేషనల్ 935 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ద్వితీయ సంవత్సరంలో 5625 మంది ఇంటర్ విద్యార్థులు, 1015 మంది వొకేషనల్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. అవకతవకలు జరుగకుండా జిల్లా స్థాయిలో హైపవర్ కమిటీలో చైర్మన్‌గా కలెక్టర్, డీసీపీ. ఆర్‌జేడీలు సభ్యులుగా ఉంటారు. జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ కన్వీనర్‌గా డీఐఈవో, ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లతో కమిటీ ఉంటుంది, 23మంది సీఎస్‌లు, 23 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, నలుగురు కస్టోడియన్లు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను పర్యవేక్షిస్తాయని, మంచిర్యాల డీఐఈవో అంజయ్య తెలిపారు.

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 4: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు 19 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈవో కల్యాణి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో జనరల్ 3,997 మంది, 761 మంది వొకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 4,527 మంది, 769 మంది వొకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్, ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని తెలిపారు. వైద్య సిబ్బందితో పాటు మందులు అందుబాటులో ఉంచినట్లు, ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు.

మంచిర్యాలలోని పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌లో పీటీజీ గురుకులంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్నమంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

పత్తి రైతులను ఇబ్బంది పెట్టొద్దు

చెన్నూర్ టౌన్, మార్చి 4 : రైతులకు ఇబ్బంది కలిగించకుండా, పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలని సీసీఐ అధికారులను మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో సీసీఐ, వ్యవసాయ శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లుల యజమానులు రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు ప్రక్రియ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పత్తి విక్రయించేందుకు వచ్చే రైతులకు తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, బ్యాంక్ అనుసంధానం, పత్తి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే సమయంలో తేమ, తప్పా వంటి అంశాల్లో పాటించాల్సిన నియమాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో మోహన్, సీసీఐ అధికారులు, ఏఈవోలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

మంచిర్యాల (ఏసీసీ),మార్చి4 : వరిధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, డీఆర్డీవో, బ్యాంకింగ్, పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా, మార్కెటింగ్ శాఖల అధికారులు, మెప్మా అధికారులతో కలిసి రైస్ మిల్లుల సంఘం ప్రతినిధులు, అధికారులతో వరిధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో 92 కొనుగోలు కేంద్రాలు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 67 కొనుగోలు కేంద్రాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 150 కొనుగోలు కేంద్రాలు, మెప్మా ఆధ్వర్యంలో 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేస్తామని తెలిపారు. ఎండల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం నీడ, తాగునీరు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని తెలిపారు.తూకానికి ముందే రైతుల వద్ద అవసరమైన జిరాక్స్‌లు సేకరించి ట్యాబ్‌లలో నమోదు చేసి రసీదు అందించాలని తెలిపారు. తూకం యంత్రాలు, తేమ శాతం మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ల కోసం టెండర్లు ఆహ్వానించి కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబొద్దీన్, డీఏవో కల్పన, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు కాంతయ్య, వైకుంఠం, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక డంపులను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు, అధికారులు

గుడిరేవులో ఇసుక డంపులు స్వాధీనం

దండేపల్లి, మార్చి4: 'తోడేస్తున్నారు'...అనే శీర్షికన సోమవారం 'నమస్తే..'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, మైనింగ్ అధికారులు మంగళవారం స్పందించారు. దండేపల్లి మండలంలోని గుడిరేవు గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన 110 ట్రాక్టర్ల ఇసుక డంపులను రెవెన్యూ, మైనింగ్, పోలీసులు అధికారులు సీజ్ చేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భూమన్న, మైనింగ్ అధికారి రాజేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అటవీ అధికారుల నోటీసులు

కౌటాల, మార్చి 4 : కౌటాల మండల కేంద్రంలో అటవీ ప్రాంతంలో ఇల్లు నిర్మించుకున్నందుకు నేరెళ్ల జనార్దన్ అనే వ్యక్తికి మంగళవారం సిర్పూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ నోటీసులు జారీ చేశారు. కౌటాల ఎఫ్ఎస్‌వో తులసీ దాస్ నాయక్ ఎఫ్‌బీవో శ్రీదేవి వెళ్లి జనార్దన్ ఇంటికి నోటీసులు అంటించారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా ఇల్లు నిర్మించుకోవడంతో పాటు 8 గుంటల విస్తీర్ణం ఆక్రమించుకున్నట్లు వారు నోటీసులో పేర్కొన్నారు. ఈ స్థలానికి పట్టా గానీ ఇతర అనుమతులు గానీ ఉన్నట్లయితే ఏడు రోజుల్లో సమర్పించాలని నోటీసులో పేర్కొన్నారు.